క్లుప్తంగా

వరసిద్ధునికి రూ.2లక్షల విరాళం



విరాళం ఇస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామికి చెన్నైకి చెందిన దాత తిలకవతి రూ.2లక్షలు విరాళంగా అందించారు. దాత కుటుంబ సభ్యులు శుక్రవారం స్వామివారి దర్శనార్థం విచ్చేసి స్వామివారి గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష, నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళంగా అందించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓ శివరాజ్‌ను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

యాదమరి: బదిలీపై వెళ్లిన ఎంపీడీఓ శివరాజ్‌కు తోటి ఉద్యోగులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎన్నికల నేపథ్యంలో మండలం నుంచి నెల్లూరు జిల్లాకు బదిలీపై యాదమరి ఎంపీడీఓ వెళ్లడంతో ఆయనను తోటి ఉద్యోగులు పూలమాలు వేసి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ హరిప్రసాద్ రెడ్డి, ఉద్యోగులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

శుభ్రంగా ఉంచుకోండి



పారిశుధ్య పనుల పర్యవేక్షణలో అధికారులు

చిత్తూరు రూరల్: ఇంటి చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు రావని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు నగరం శంకరయ్యగుంటలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. పలు ఇళ్ల పరిసరాలను పరిశీలించారు. శుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. నీటి నిల్వలుంటే దోమలు వృద్ధి చెందుతాయని, తద్వారా అంటువ్యాధులు వస్తాయని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది రామకృష్ణ, పీరు సాహెబ్ ఉన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

చిత్తూరు రూరల్: బదిలీపై వెళుతున్న చిత్తూరు తహసీల్దార్ మురళీ మోహన్‌ను పలువురు ఘనంగా సన్మానించారు. నగరంలోని ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో సన్మానించారు.

తిరుపతి స్విమ్స్‌కు వెళ్లి పింఛన్ అందజేత



పింఛను అందజేస్తున్న వలంటీర్ లావణ్య

ఐరాల: మండలంలోని మొరంపల్లె పంచాయతీకి చెందిన లావణ్య శుక్రవారం తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేసింది. మొరంపల్లె బీసీ కాలనీకి చెందిన కుప్పిశెట్టి, వెంకటలక్ష్మి భార్యభర్తలు, కుప్పిశెట్టి స్విమ్స్‌లో డయాలసిస్ చికిత్స పొందుతున్నాడు. అక్కడే భర్త వద్ద భార్య ఉంటోంది. కుప్పిశెట్టికి డయాలసిస్ పింఛను వస్తుండడంతో విధి నిర్వహణలో భాగంగా వలంటీర్ ఆస్పత్రికి వెళ్లి రూ.10వేలు పింఛను అందజేసింది.

స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యం

పలమనేరు: శిక్షణతో స్వయం ఉపాధి పొందవచ్చని స్కిల్‌హబ్ కో–ఆర్డినేటర్ సుబ్బయ్య నాయుడు అన్నారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్‌లో బ్యూటీషియన్ శిక్షణ పూర్తి చేసుకున్న 30మందికి శుక్రవారం సర్టిఫికెట్లను ప్రదానం చేసి ఆయన మాట్లాడారు. ఇక్కడ శిక్షణ పొందిన చాలామందికి ఉపాధి కల్పించామన్నారు. వారంతా ఆర్థికంగా నిలదొక్కుకుని కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నారన్నారు. శిక్షణతో నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. శిక్షణ పొందడానికి ఆసక్తి కలిగిన వారు తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశులు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయశేఖరం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల యుద్ధానికి సిద్ధం అవుదాం





ఆత్మీయ సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్

- జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకుందాం
- వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం
- ఆత్మీయ సమావేశంలో పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్

బంగారుపాళెం: ఎన్నికల యుద్ధానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. పార్టీ మండల కన్వీనర్ పాలకూరు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అరగొండ రోడ్డులోని కామరాజు గార్డెన్స్ ఆవరణలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. తగ్గువారిపల్లె ఎంపీటీసీ షబీనా భర్త వైఎస్సార్‌సీపీ యువనేత చాన్‌బాషా మృతికి సంతాపం వ్యక్తం చేశారు. డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ, నాలుగున్నరేళ్లలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. 2019 ఎన్నికలకు ముందు జగనన్న పాదయాత్రలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చారన్నారు. అధికారం చేపట్టిన తరువాత నవరత్న పథకాలతో నిరుపేదల సంక్షేమానికి కృషి చేశారన్నారు. పరిపాలన వ్యవస్థను గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకు తీసుకువచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ ఫిజీషియన్, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రతి గడపకు లబ్ధి చేకూరిందన్నారు. ఎన్నికల్లో గెలుపొందేందుకు టీడీపీ నాయకులను గట్టిగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని గుర్తు చేశారు. సీఎం జగనన్న బటన్ నొక్కి లబ్ధిదారులకు మేలు జరిగేలా పాలన సాగిస్తున్నారన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ సూర్యుడు ఉదయించక ముందే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛను అందిస్తుండడంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. అటువంటి ముఖ్యమంత్రిని మళ్లీ సీఎంగా గెలిపించుకుందామన్నారు. జగనన్నను గెలిపించుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, మీరు అందరూ సిద్ధమా అని కార్యకర్తలను ప్రశ్నించడంతో ముక్తకంఠంతో నాయకులు, కార్యకర్తలు సిద్ధం అంటూ చెప్పారు. 2014లో తనను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు బంగారుపాళెం మండల నాయకులు కలసికట్టుగా కృషి చేశారన్నారు. పూతలపట్టు నియోజకవర్గ పరిశీలకులు మోహన్‌రెడ్డి, రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, ఎంపీపీ అమరావతి మాట్లాడుతూ, 2024లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకునేందుకు సమన్వయంతో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమాల్లో రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, వైస్ ఎంపీపీలు శిరీష్‌రెడ్డి, జయకుమార్, జెడ్పీటీసీ సోమశేఖర్, వడ్డెర, ఈడిగ, కురబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు మొగిలీశ్వర్, ఎల్లప్ప, అమరనాథ్, ఏఎంసీ, సింగిల్ విండో చైర్మన్లు నారే సోమశేఖర్, దత్తాత్రేయరెడ్డి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు సర్దార్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శరత్‌రెడ్డి, కృష్ణమూర్తి, కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి జ్యోతీశ్వరి, రైతు విభాగం కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, ఎస్సీ, బీసీ, మైనారిటీ సెల్ అధ్యక్షులు నాగరాజ, దొరస్వామి, హిదాయత్, మండల వైద్యాధికారి లోహిత్‌చెంగల్‌రాయన్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పల్లె ముంగిట కార్పొరేట్ వైద్యం

ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్ వైద్య సేవలను గ్రామాల ముంగిటకు తీసుకువచ్చారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని టేకుమందలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సునీల్‌కుమార్ వైద్య శిబిరానికి విచ్చేసిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో 302 మందికి వివిధ వైద్యపరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వృద్ధులకు వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ, ఫ్యామిలీ ఫిజీషియన్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా గ్రామాలలో పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, ఆరోగ్యానికి పెద్ద పీటవేశారన్నారు.



టేకుమందలో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

నేను ఎప్పటికీ వైఎస్సార్‌సీపీ విధేయుడినే

తవణంపల్లె: వైఎస్సార్‌సీపీకి తాను ఎప్పటికీ విధేయుడిగానే ఉంటానని జగన్‌మోహన్ రెడ్డిని మరో సారి సీఎంగా చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తానని దిగువ మోదలపల్లె సర్పంచ్ చలపతి స్పష్టం చేశారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి గతంలో వైఎస్సార్‌సీపీలో ఉన్నప్పుడు ఉన్న పరిచయం వల్ల శుక్రవారం తమ గ్రామానికి వచ్చినప్పుడు కలిశానని చెప్పారు. అయితే అనుకోకుండా టీడీపీ నాయకులు తనపై కండువా వేశారని చెప్పారు. అప్పటికీ తాను వద్దని వారిస్తున్నా వినలేదని వివరించారు. చివరికి ఆ ఫొటో తీసి తాను టీడీపీలో చేరినట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. వాస్తవానికి గ్రామంలో టీడీపీ నాయకులకే కండువాలు వేసి టీడీపీలో చేరినట్లు ప్రచారం చేస్తున్నారని వెల్లడించారు. ఈ విషయం గ్రామంలో అందరికీ తెలుసని చెప్పారు. తాను వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం పని చేస్తానని, జగనన్న మరోమారు సీఎం కావడం తథ్యమని అన్నారు.

అప్రెంటీస్ విధానాన్ని పునఃపరిశీలించాలి

చిత్తూరు కలెక్టరేట్ : డీఎస్సీలో ఎంపికయ్యే టీచర్లకు ప్రవేశపెట్టబోయే అప్రెంటీస్ విధానం ను ప్రభుత్వం పున:పరిశీలించాలని స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నరోత్తమరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. త్వరలో నిర్వహించే డీఎస్సీలో ఈ ఏడాది మార్చి వరకు ఖాళీ అయ్యే పోస్టుల వివరాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఏపీజీఎల్ఐ మెచ్యూరిటీ రుణ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్‌ల నగదు వెంటనే విడుదల చేయాలని నరోత్తమరెడ్డి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న కుటుంబాలకు ఉపాధి



నాగంవాండ్లపల్లెలో ఫారంపాండ్ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ గంగాభవాని

ఐరాల: ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులకు జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 100 రోజుల పనులు కల్పిస్తున్నట్లు డ్వామా పీడీ గంగాభవాని పేర్కొన్నారు. మండలంలోని నాగంవాండ్లపల్లెలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం డ్వామా పీడీ ఘనంగా నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న ఫారం పాండ్ పనులను పరిశీలించారు. జిల్లా క్షేత్రస్థాయి ఉపాధి సిబ్బంది జేఈ, టీఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనులు నాణ్యతగా చేపట్టేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే కూలీ గిట్టుబాటు అవుతుందన్నారు. కూలీలు సమయపాలన పాటించాలన్నారు. ఉపాధి కూలీలను పిలిపించి ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద చేపడుతున్న పనులపై ఆరా తీశారు. అనంతరం వడ్డిపల్లెకు చెందిన ఉపాధి మహిళ కూలీ చిన్నమ్మ 100 రోజుల పని దినాలను పూర్తిచేయడంతో ఆమెను పీడీ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీడీ సునీల్, ఏపీఓ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం కోసమే జగనన్న సురక్ష

ఐరాల: ప్రజారోగ్యం కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పుత్రమద్ది సచివాలయంలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో వైద్య నిపుణులు 189 మందికి వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం కంటి పరీక్షలు చేసుకున్న వృద్ధులకు కళ్లద్దాలు, హెల్త్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుశీల, స్పెషలిస్టు డాక్టర్లు రాజేశ్వరి, స్వాతి సింధూర, శారద, శిరీష పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజేశ్వరి

ఎంజీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తాం

- హామీ ఇచ్చిన విజయానందరెడ్డి
- ఫ్యాన్ గుర్తుకు ఓటువేయాలని ప్రచారం

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరులో తమిళనాడు మాజీ సీఎం ఎంజీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, అభిమానుల కోరిక తీరుస్తామని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి హామీనిచ్చారు. దీంతో అక్కడ ఉన్న అభిమానులు కేరింతలతో హర్షం తెలిపారు. స్థానిక తోటపాళ్యంలో శుక్రవారం అట్టహాసంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంజీఆర్ వేషధారణలో వ్యక్తి అభివాదం, వందలాది కార్యకర్తలు, మొబైల్ వీడియో ప్రదర్శన ద్వారా ఫ్యాన్‌కు ఓటువేయాలని ప్రచారం చేశారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం చంద్రబాబునాయుడు డ్వాక్రామహిళల రుణమాఫీ చేస్తామని చెప్పి, చివర్లో పసుపు–కుంకుమ పేరుతో మహిళలను మోసం చేశారని మండిపడ్డారు. కానీ తర్వాత వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగు దఫాలుగా డ్వాక్రా రుణమాఫీ చేశారని వివరించారు. ప్రతి గడప దగ్గర ప్రజలు ఆనందంగా స్వాగతం పలుకుతున్నారని చెప్పారు. ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరుతుందని మళ్లీ తిరిగి మన ప్రభుత్వాన్ని ఎన్నుకుంటామని ప్రజలు తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు మేలు చేయడం చేతకానీ గత పాలకులు ఇప్పుడు జరుగుతున్న సంక్షేమంపై కడుపుమంటతో తప్పుడు విమర్శలు చేస్తున్నరని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మేయర్ అముద, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, టౌన్‌బ్యాంకు చైర్మన్ రాంగణేష్, నగర పార్టీ అధ్యక్షులు టిమ్ము, స్థానిక కార్పొరేటర్ గణేష్‌మేస్త్రీ, కార్పొరేటర్లు, కోఆప్షన్ మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో కార్యకర్తలతో విజయానందరెడ్డి

జగనన్నను మళ్లీ సీఎంను చేసుకుందాం

చిత్తూరు రూరల్: క్షేత్రస్థాయిలోని నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందామని విజయానందరెడ్డి అన్నారు. చిత్తూరు మండలం తాళంబేడు గ్రామంలో శుక్రవారం ఆయన పల్లెబాట నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలోని నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ సందర్శించి ప్రభుత్వ పథకాల లబ్ధి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థాయి సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాభివృద్ధిని వివరించారు. తదనంతరం విజయానందరెడ్డి మాట్లాడుతూ పేదల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నట్లు గుర్తుచేశారు. అందుకే పలు పథకాల ద్వారా పేద కుటుంబాలకు లబ్ధి చేకూర్చారన్నారు. అయితే దీన్ని జీర్ణించుకోలేని ప్రతిపక్షం ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని పచ్చనేతలు కుయుక్తులు పన్నుతున్నారన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడడంతో ప్రజలను మాయమాటలో మోసగించాలని చూస్తున్నారని చెప్పారు. ఇవన్నీ కూడా స్వార్థ రాజకీయాలు మాత్రమేనన్నారు. కరోనా వంటి విపత్తుల సమయంలో వలస వెళ్లిపోయిన నాయకులకు ఇప్పుడెందుకు ప్రజలు గుర్తొచ్చారో తెలుసు కదా అని ప్రశ్నించారు. ప్రతి నాయకుడు, కార్యకర్త పార్టీ కోసం బాధ్యతతో పనిచేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందనే విషయాన్ని మర్చిపోవదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, త్యాగరాజులు, నాయకులు సంపత్ తదితరులు పాల్గొన్నారు.



తాళంబేడు పల్లెబాటలో నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి

పేదలందరికీ మెరుగైన వైద్య సేవలు

తవణంపల్లె: గ్రామాల్లో నివసిస్తున్న పేదలందరికీ మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఎగువ తవణంపల్లెలో డాక్టర్ ప్రియాంక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎగువ మత్యంలో వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు రోగులకు వైద్యపరీక్షలు చేశారు. అనంతరం గర్భిణులకు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి సూచనలు సలహాలిచ్చారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, మాత్రలు అందజేశారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజామణి, పీహెచ్‌ఎన్ భారతి, హెల్త్ సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీలు భార్గవి, ఝాన్సీ, ఏఎన్‌ఎంలు తులసమ్మ, శ్రీదేవి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిరుపేదలకు వరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మొరుంపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 85 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామంలో దోమల వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమ కాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు

ఇంటి వద్దకే వైద్యం

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని బొమ్మసముద్రం వైద్యాధికారి అనుష అన్నారు. నంగమంగళం గ్రామంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలు, కిషోరబాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం బీపీ, షుగర్ ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. 65 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది పవిత్ర, ప్రియాంక, శాంతకుమారి, శ్రీలత, రూబి, వరలక్ష్మి, సరిత పాల్గొన్నారు.



గుడిపాల: రోగులకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్ అనూష



తవణంపల్లె: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక



ఐరాల: గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

నమో నారసింహ.. నమో భక్తపాల

నారాయణవనం: మండలంలోని సింగిరి కోన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం విశేష అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. స్వామి జన్మ నక్షత్రమైన స్వాతిని పురస్కరించుకుని ఉదయం 10 గంటలకు శ్రీదేవీ, భూదేవీ సమేత లక్ష్మీ నరసింహస్వామి మూలవర్లకు అభిషేకాలను నిర్వహించారు. వెండి కవచాలను, సుగంధభరిత పుష్పమాలికలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో గణపతి, నవగ్రహ, సుదర్శన, ధన్వంతరి, మహా విష్ణు హోమాలను ఆగమోక్తంగా నిర్వహించి పూర్ణాహుతిని సమర్పించారు. భక్తులకు వస్త్ర బహుమానంతో పాటు తీర్థ ప్రసాదాలను ట్రస్టీ సభ్యులు గిరిబాబు, భాస్కర్ బాబు అందజేశారు. భక్తులకు అన్నదాన సత్రంలో అన్నప్రసాదాలను అందజేశారు. ట్రస్టీ సభ్యుడు గిరిబాబు మాట్లాడుతూ ప్రతి పౌర్ణమి రోజున ఉభయ నాంచారులతో లక్ష్మీ నరసింహ స్వామికి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామి వారి జన్మనక్షత్రం స్వాతి రోజున హోమాలను ఆగమోక్తంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు ఆలయానికి వచ్చే భక్తులకు మూడు పూటలా అన్న ప్రసాదాలను నిత్య అన్నదాన సత్రంలో అందచేస్తున్నట్లు తెలిపారు.



విశేష అలంకరణలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి

జగనన్నను మళ్లీ గెలిపించుకుందాం



వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

గుడిపాల: జగనన్నను రెండోసారి సీఎంగా చేసుకుందామని చిత్తూరు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి అన్నారు. ఆయన కార్యాలయంలో శుక్రవారం గుడిపాల మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనంతపురంలో ఈనెల 11వ తేదీన సీఎం సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, మధుసూదన్ రాయల్, రవియాదవ్, నవీన్, సాయి, గుండు సాయి, శిలంబరసన్, కలైఅరసి, రవీంద్రారెడ్డి, క్రిష్ణమూర్తి, విజయ్, గుణవతి, జయకోడి పాల్గొన్నారు.